నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శనివారం 15 జూన్ 2024 | KHAMMAM

రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ

రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 14 : శుక్రవారం సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5 కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. ప్రత్యేక కవచాలంకరణలో సీతారామ, లక్ష్మణ మూర్తులు మరింత రమణీయంగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న 23 జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

బదిలీలు, పదోన్నతులు, ఖాళీలు!

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో భద్రాద్రి జిల్లా విద్యాశాఖ కార్యాలయం సందడిగా మారింది. ఎంతో కాలంగా భాషా పండితులు తెలుగు, హిందీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు(పీఈటీ) పదోన్నతులు, బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు ఇది సంతోషకరంగా ఉన్నా.. విద్యాసంవత్సరం ఆరంభంలోనే ఈ ప్రక్రియను చేపట్టడంతో బడిబాట కార్యక్రమానికి అక్కడక్కడా అవాంతరాలు ఏర్పడ్డాయి. జిల్లావ్యాప్తంగా 2,500 మంది ఎస్జీటీలు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నా.. ఇంకా 400 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతోపాటు ఎస్జీటీ తత్సమాన భాషా పండితులు తెలుగు, హిందీ, పీఈటీలు 800 మందికి ఉద్యోగోన్నతి కల్పిస్తే వారంతా అప్‌గ్రేడ్ పాఠశాలలకు వెళ్లనున్నారు. దీంతో అప్‌గ్రేడ్ కాని పాఠశాలలతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పలు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో సతమతమవుతున్న విద్యావ్యవస్థ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలతో మరింత బలహీన పడనున్నదనే సంకేతాలు వస్తున్నాయి. అసలే సర్కారు బడుల్లో సౌకర్యాలు లేక విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది తగ్గుపోతుంటే.. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండానే బదిలీలు, పదోన్నతులు చేపట్టడం వల్ల ఈ విద్యా సంవత్సరం పాఠశాలల్లో టీచర్లు లేక వెలవెలబోయే పరిస్థితి కనిపిస్తోంది. దీనిని అధిగమించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారనున్నది.

బదిలీలు, పదోన్నతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

భాషా పండితులు తెలుగు, హిందీ, పీఈటీలు పదోన్నతులు, బదిలీల కోసం ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, అభ్యంతరాల స్వీకరణతోపాటు వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితాను ఉంచనున్నారు. అయితే జిల్లాలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొన్ని పొరపాట్లు దొర్లడంతోపాటు సరైన పత్రాలను సకాలంలో సమర్పించకపోవడం వల్ల మళ్లీ అప్పీల్ చేసుకునే వెసులుబాటును విద్యాశాఖ కల్పించింది. దీంతో పదోన్నతులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు వారం రోజుల నుంచి విద్యాశాఖ కార్యాలయం వద్ద క్యూ కడుతున్నారు. ఎక్కడ ఖాళీలు ఉన్నాయి? బదిలీ అయితే ఏ పాఠశాలకు వెళ్లాలి? అనే దానిపై తర్జన భర్జన పడుతున్నారు. అభ్యంతరాల అనంతరం జాబితాను వెలువరించి ఆప్షన్ల ద్వారా విద్యాశాఖ అధికారులు ఉద్యోగోన్నతులు కల్పించనున్నారు. ఈ నెల 16 కల్లా పదోన్నతులు కల్పించి.. 22వ తేదీ నాటికి బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ తేదీలను కూడా ఖరారు చేసింది. దీనిపై కసరత్తు కూడా తుది దశకు చేరింది.

విద్యాశాఖ కార్యాలయంలో అప్పీళ్ల కోసం వచ్చిన టీచర్లు

బదిలీలు సరే.. కొత్త టీచర్ల భర్తీ ఎప్పుడో?

బదిలీలు, పదోన్నతులు వారి అర్హతను బట్టి కల్పించినా.. కొత్త ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ఈ ప్రక్రియను చేపట్టడంపై సర్వత్రా ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికే ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయడంలో చాలా కాలంగా నిర్లక్ష్యం చేస్తూనే వస్తున్నారు. దీంతో సర్కారు పాఠశాలల విద్యపై నీలినీడలు అలుముకుంటున్నాయి. అయినా ఎన్నో సవాళ్లను భరిస్తూనే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

సమస్యలు కోకొల్లలు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. పాఠశాలల పునఃప్రారంభం నాటికి యూనిఫాంలు ఇవ్వలేకపోవడం, అప్పుడప్పుడు పిల్లలకు మధ్యాహ్న భోజనంలో వడ్డించే కూరలు అంతంతమాత్రంగానే పెట్టడం వల్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. అంతేకాక మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో వారు కూడా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇలాంటి సమస్యలు నిత్యం విద్యాశాఖను వెంటాడుతూనే ఉన్నాయి.

ఇక సర్కారు బడుల్లో చదువులు సాగేదెలా..

- జిల్లాలో కొనసాగుతున్న టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ
- 800 మందికి పైగా ఉద్యోగోన్నతి పొందనున్న ఉపాధ్యాయులు
- ఖాళీల్లో విద్యావలంటీర్లను నియమించాలని సంఘాల విజ్ఞప్తి

టీచర్ల బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను స్వీకరిస్తున్న విద్యాశాఖ సూపరింటెండెంట్ జ్యోతి

విద్యావలంటీర్లను నియమించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చాలా కాలం తర్వాత బదిలీలు, పదోన్నతులు చేపడుతున్నారు. ఇది సంతోషకరమైన విషయమే. కానీ.. ప్రస్తుతం పదోన్నతులపై వేరే పాఠశాలలకు వెళ్లనున్న టీచర్ల స్థానంలో ప్రభుత్వం విద్యావలంటీర్లను నియమించాలి. అలాంటి సమస్య రాకుండా విద్యాశాఖ ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే పలు పాఠశాలల్లో టీచర్ల సమస్య ఉంది.

-బి.రవి, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి

22 నాటికి ప్రక్రియ పూర్తి..

ఈ నెల 22వ తేదీ నాటికి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తవుతుంది. ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వం డీఎస్సీ ద్వారా కొత్త టీచర్లను నియమిస్తుంది. అప్పటి వరకు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై సర్దుబాటు చేస్తాం. విద్యావలంటీర్లను నియమించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుంది.

-వెంకటేశ్వరాచారి, భద్రాద్రి డీఈవో

భూ సేకరణ వేగవంతం చేయండి

కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, జూన్ 14 : జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టిన రైల్వే, జాతీయ రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణ పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాస్తవ అవసరం మేరకు భూ సేకరణ చేపట్టాలని సూచించారు. మూడో రైల్వే లైన్‌కు సంబంధించి జిల్లాలో 59.17 హెక్టార్ల భూ సేకరణ జరపాల్సి ఉండగా.. 54.28 హెక్టార్లకు అవార్డ్ పాస్ చేసి.. స్వాధీనం చేసుకున్న భూమిని రైల్వే శాఖకు అప్పగించినట్లు తెలిపారు. మిగులు 4.11 హెక్టార్లకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. డోర్నకల్ జంక్షన్-భద్రాచలం రోడ్ జంక్షన్ల మధ్య రైల్వే డబ్లింగ్ లైన్ ప్రాజెక్టుకు సంబంధించి సింగరేణి మండలం కమలాపురం, పోచారం, సింగరేణి, కారేపల్లి, కోమట్లగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో 57.045 ఎకరాల భూ సేకరణకు జేఎంఎస్ సర్వే ప్రక్రియ చేపట్టి పీఎన్ పబ్లిష్ చేయాలన్నారు. రఘునాథపాలెం మండలం పాపటపల్లి, చింతకాని మండలం బస్వాపురం, నాగులవంచ, పాతర్లపాడు, ఎర్రుపాలెం మండలం ఎర్రుపాలెం వద్ద ఆర్వోబీ నిర్మాణాలకు భూ సేకరణ చేసి రైల్వేకు అప్పగించాలన్నారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-1 కొరకు జిల్లాలో 548.08 ఎకరాల భూ సేకరణకు 507.2925 ఎకరాలకు అవార్డ్ పాస్ కాగా.. రూ.144.84 కోట్లు భూ నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇదే ప్రాజెక్ట్ ప్యాకేజీ-2 కింద 424.19 ఎకరాల భూసేకరణకు.. 407.0450 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి.. ఇప్పటివరకు రూ.98.34 కోట్లు పరిహారం చెల్లించామని, ఇంకా 17.1450 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే ప్యాకేజీ-3 కింద 383.3325 ఎకరాల భూ సేకరణకు.. 371.1200 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి.. రైతుల ఖాతాల్లో రూ.88.94 కోట్లు జమ చేశామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్(పాలేరు లింక్ కెనాల్) కింద ఏన్కూరు, కామేపల్లి, సింగరేణి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో 1717.34 ఎకరాల భూ సేకరణకు.. 1569.39 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి.. ఇప్పటివరకు భూ పరిహారం కింద రూ.93.39 కోట్లు, నిర్మాణాల పరిహారం కింద రూ.7.30 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్(సత్తుపల్లి ట్రంక్ కెనాల్) కింద 330.15 ఎకరాల భూసేకరణకు.. 325.30 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి.. రూ.19.59 కోట్లు పరిహారం కింద విడుదల చేసినట్లు తెలిపారు. ఏన్కూరు వద్ద 18ఎల్ కెనాల్, బుగ్గవాగు ప్రాజెక్ట్‌ల కోసం భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు. మున్నేరు రిటైనింగ్ వాల్ కొరకు 190.16 ఎకరాల భూసేకరణ ప్రక్రియకు క్షేత్ర స్థాయి తనిఖీలు చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, ఆర్డీవోలు జి.గణేశ్, ఎల్.రాజేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, మైనింగ్ ఏడీ సాయినాథ్, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఇరిగేషన్, మున్సిపల్, రైల్వే శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

డీవార్మింగ్ మాత్రలు వేయించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెం అర్బన్, జూన్ 14 : చిన్నారులకు తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా మండల లెవల్ టాస్క్‌ఫోర్స్ అధ్వర్యంలో కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డీవార్మింగ్ మాత్రలు ఏడాది నుంచి మూడేళ్ల వయసు గల పిల్లలకు సగం మాత్రను పొడిచేసి నీళ్లలో కలిపి తాగించాలని, నాలుగేళ్ల నుంచి 19 ఏళ్ల వయసు గల వారు ఫుల్ టాబ్లెట్‌ను చప్పరించి మింగిన తర్వాత నీళ్లు తాగాలని సూచించారు. దీని వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, దీనిపై వైద్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పాఠశాల ఉపాధ్యాయులు కూడా అవగాహన కల్పించారని అన్నారు. ఎన్‌డీడీ కార్యక్రమం ఈ నెల 20న నిర్వహించనున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఆమె కోరారు. మాత్రలు మింగని పిల్లల చేత ఈ నెల 27న మళ్లీ కార్యక్రమంలో వేయిస్తామని తెలిపారు. అనంతరం డీవార్మింగ్ డే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపర్‌వైజర్లు కరుణశ్రీ, సీహెచ్.శారద, వి.శ్రీనివాసరావు, దేవేంద్రమ్మ, శారద, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు ఉంటాయి
- పంట నష్టంలో ఎకరానికి రూ.10 వేల పరిహారం
- అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- ఖమ్మం జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి తుమ్మల

మామిళ్లగూడెం, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి చేయూతనందిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తమ ప్రభుత్వం నుంచి వారికి అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి మంత్రి హాజరయ్యారు. వ్యవసాయం, విద్య శాఖల అంశాల అజెండాల చర్చలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించేలా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రైతులు కూడా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు కూడా అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. రైతులు రాజీపడితే దళారులు నకిలీ విత్తనాలు విక్రయించే ప్రమాదముందని అన్నారు. రైతు సంఘాల బాధ్యులు, ప్రజాప్రతినిధులతో చర్చించి రైతు భరోసా కార్యక్రమ విధివిధానాలు రూపొందిస్తామని అన్నారు. జిల్లాలో ఈ ఏడాది నుంచే గోదావరి జలాలను పారించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. నిర్దిష్టమైన సమయంలో జూలూరుపాడు, పాలేరు, యాతాలకుంట వద్ద టన్నెళ్లు పూర్తి చేసి సత్తుపల్లి ప్రాంతానికి, అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు నీటిని అందిస్తామని వివరించారు. అలాగే, టన్నెళ్లు అవసరం లేని వైరా, లంకాసాగర్ జలాశయాలకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నామని వెల్లడించారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాం..

విద్యా సంవత్సరం ప్రారంభమైనందున ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు అందించామన్నారు. ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. ఇంకా ఉపాధ్యాయుల నియామకం కోసం డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇచ్చినట్లు గుర్తుచేశారు.

రైతులకు విత్తనాలు అందించాలి: జడ్పీ చైర్మన్

అనంతరం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ.. రైతుల డిమాండ్‌కు తగినట్లుగా విత్తనాలు అందించాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కాగా, సమావేశంలో పలువురు జడ్పీటీసీలు తమ మండలాల్లో ఉన్న సమస్యలను జడ్పీ సమావేశంలో ప్రస్తావించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో వినోద్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ఖమ్మం ఐడీవోసీలో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

కొత్తగూడెం ఐడీవోసీలో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, చిత్రంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్

మామిళ్లగూడెం, జూన్ 14: ధరణిలోని పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం ఖమ్మం నుంచి కలెక్టర్ వీపీ గౌతమ్ సమాధానమిస్తూ.. జిల్లాలో అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్ల స్థాయిల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వచ్చే పక్షం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరిస్తామని అన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో జిల్లాలో 3,500 దరఖాస్తులు పరిష్కరించామని, ఫిజికల్‌గా 5 వేల దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు. అధికారులు ఇటీవల ఎన్నికల విధుల్లో నిమగ్నమైనందున కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇక నుంచి వీటిపై దృష్టి కేంద్రీకరించి పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు.

రోజుకు పాతిక దరఖాస్తులు పరిష్కరించాలి: కలెక్టర్

ఒక్కో తహసీల్దార్ రోజుకు కనీసం 25 దరఖాస్తులను పరిష్కరించాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఈ దిశగా కార్యాచరణ చేసి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. సీసీఎల్ఏ కమిషనర్ వీసీ అనంతరం జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో ధరణి దరఖాస్తులపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న కారణాలతో దరఖాస్తులను తిరస్కరించవద్దని సూచించారు. అనంతరం ధరణి మాడ్యూల్స్‌పై తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవోలు గణేశ్, రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ల వీసీలో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

ప్రత్యేక డ్రైవ్‌లో 15 రోజుల్లో పరిష్కరిస్తాం: కలెక్టర్

385 పెండింగ్ దరఖాస్తులు: భద్రాద్రి కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి జిల్లాలో 385 ధరణి దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక తెలిపారు. సీసీఎల్ఏ వీసీలో భద్రాద్రి ఐడీవోసీ నుంచి ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ వల్ల దరఖాస్తుల విచారణ నిలిచిపోయిందని అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 80 శాతం దరఖాస్తుల విచారణను పూర్తి చేశామని, ఇంకా 20 శాతం దరఖాస్తుల విచారణ మాత్రమే పెండింగ్‌లో ఉందని వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ దరఖాస్తులపై కూడా వెంటనే విచారణ చేపట్టాలని, వారం రోజుల్లోగా పూర్తి నివేదికలు అందజేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, డీఆర్‌వో రవీందర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పదోన్నతులకు నూతన ఫార్మాట్

నేడు, రేపు ఆప్షన్స్‌కు అవకాశం?

నూతన ఫార్మాట్‌లో పదోన్నతుల ప్రక్రియను సిద్ధం చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 14 : ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఈ నెల 12, 13వ తేదీల్లో జరగాల్సిన ఆప్షన్ల ప్రక్రియ కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయింది. ఆయా ఉపాధ్యాయులకు గురువారం ఆప్షన్స్ ఎంపికకు అవకాశం కల్పించినప్పటికీ పూర్తిస్థాయిలో అర్హులైన టీచర్ల సెల్ ఫోన్‌లను ఓటీపీలు రాకపోవడం, సకాలంలో వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో వంటి అంశాలతో విద్యాశాఖ నూతన ఫార్మాట్‌లో జాబితాను రూపొందిస్తోంది. మల్టీజోన్-1 పరిధిలోని జిల్లాలో ఉద్యోగోన్నతుల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు కొన్ని కొత్త అంశాలను జోడించి నూతన ఫార్మాట్‌లో ఉపాధ్యాయుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలోనే దీనిపై ఉన్న కోర్టు కేసు ముగియడంతో ప్రక్రియకు సంబంధించిన ఆటంకాలన్నీ తొలగిపోయాయి. ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే వారితోపాటు లాంగ్వేజ్ పండిట్స్ తెలుగు, హిందీ సబ్జెక్టులు, పీఈటీ, పీడీల జాబితాను జిల్లా విద్యాశాఖ సిబ్బంది నూతన ఫార్మాట్‌లో ఉన్నతాధికారులకు చేరవేశారు.

నేడు, రేపు ఆప్షన్స్‌కు అవకాశం?

పదోన్నతులు పొందే అర్హులైన ఉపాధ్యాయులు ఆప్షన్స్ ఎంపిక చేసుకునేందుకు విద్యాశాఖ అధికారులు ఈ నెల 15, 16వ తేదీల్లో అవకాశం కల్పించనున్నారు. రెండు రోజులపాటు ఉపాధ్యాయులు తమ ఐచ్ఛికాలను ఇచ్చుకునేందుకు వెసులుబాటు ఇవ్వనున్నారు. దీనిపై శనివారం ఉదయం వరకు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అధికారికంగా సమాచారం ఉంటుందని విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. నూతన ఫార్మాట్‌లో రూపొందించిన జాబితాను కూడా జిల్లా విద్యాశాఖాధికారులు పరీక్షించారు. కొందరి ఉపాధ్యాయుల వివరాలకు ఓటీపీలు వస్తున్నాయా? లేదా? అని చెక్ చేశారు. జిల్లాలో మొత్తం 1,030 మందికి పదోన్నతులు దక్కనున్నాయి. వీరిలో ఎస్జీటీల నుంచి ఎస్ఏలుగా 504 మంది, అప్‌గ్రేడ్ ద్వారా పదోన్నతులు పొందే ఉపాధ్యాయులు 526 మంది ఉన్నారు.

రెండు మండలాల్లో గాలివాన బీభత్సం

విరిగిన విద్యుత్ స్తంభాలు, కూలిన వృక్షాలు

భద్రాచలంలో 4 గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భద్రాచలం, జూన్ 14 : ఏజెన్సీలోని భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. గాలుల ధాటికి పెద్ద పెద్ద వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కొన్నిచోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పిడుగుపాటు శబ్దానికి భద్రాచలం పట్టణంలోని అర్చకుడు విశ్వతేజకు చెందిన ద్విచక్ర వాహనం బ్యాటరీ దగ్ధమైంది. గాలులకు బ్రిడ్జి సెంటర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సెట్టింగ్ కూలిపోయింది. పట్టణంతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు కొన్ని గంటలపాటు అంతరాయం ఏర్పడింది. విద్యుత్, పంచాయతీ సిబ్బంది తీగలపై పడిన చెట్ల కొమ్మలను తొలగించి రాత్రి 8 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సరిహద్దు ఉన్న ఏపీ రాష్ట్రంలోని యటపాక ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే కొన్ని రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు శుక్రవారం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం లభించింది. కాగా.. విద్యుత్‌ను సకాలంలో పునరుద్ధరించిన విద్యుత్ అధికారులు, సిబ్బందికి పట్టణ ప్రజలు అభినందనలు తెలిపారు.

భద్రాచలంలో ధ్వంసమైన ఎగ్జిబిషన్ సెట్టింగ్

భారీ వర్షానికి అన్నదాన సత్రం వద్దకు చేరిన నీరు

మత్స్య ఉత్పత్తులకు మంచి ఆదరణ

చేపల పెంపకంపై పెరుగుతున్న మక్కువ: శాస్త్రవేత్త

పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో మత్స్య రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి, జూన్ 14: చేపల పెంపకంపై రైతులు గతం కంటే ఎక్కువగా మక్కువ చూపుతున్నారని పాలేరు మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. మత్స్య ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ఆదరణ, డిమాండ్ ఉన్నాయని గుర్తుచేశారు. కూసుమంచి మండలం పాలేరులోని పీవీ నర్సింహారావు వ్యవసాయి విశ్వవిద్యాలయం పరిధిలోని మత్స్య పరిశోధనా కేంద్రంలో మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండో రోజు శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన 25 మంది రైతులకు చేపల పెంపకం, వాటి యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. చేపల పెంపకంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చేపలు వ్యాధుల భారిన పడకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం చేపల ప్యాకింగ్‌లో